ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు


నీటి ఘనత బాబుదే..!

- పులివెందులకు నాడు సాగునీరు.. నేడు తాగునీరు
- పల్లెపల్లెకు తాగునీరందించే వాటర్‌గ్రిడ్ పనులు వేగవంతం
- ఈ నెల 20 నాటికి పనులు పూర్తి చేసేలా టార్గెట్
- జనవరిలో సీఎం చంద్రబాబుతో ప్రారంభం


పులివెందులలో జరుగుతున్న వాటర్‌గ్రిడ్ పనులు



ఉమ్మడి రాష్ట్రానికి, విభజిత రాష్ట్రానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అందించిన ఖిల్లా పులివెందుల. దివంగత రాజశేఖరరెడ్డి, జగన్ ఇక్కడ నుంచే ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. అయితే ఆ ఇద్దరి హయాంలో పులివెందుల బీడు భూములకు సాగునీరు, ప్రజలు గొంతు తడుపుకునేందుకు తాగునీరు అందించకపోవడం గమనార్హం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోనే పులివెందుల బీడు భూముల్లో క్రిష్ణమ్మ జలాలు సవ్వడి చేస్తుంటే.. ఇప్పుడు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. వచ్చే జనవరిలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించేందుకు పులివెందుల నియోజకవర్గంలో వాటర్‌గ్రిడ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

(కడప-ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పులివెందులలో వేసవి వచ్చిందంటే చాలు.. చీనీ చెట్లను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేసేవారు. ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలి చెట్లను కాపాడుకునేవారు. అయితే పులివెందుల రైతుల కష్టాలను 2014-19 టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు పరిష్కరించారు. గండికోట నుంచి క్రిష్ణాజలాలను అందించి పులివెందులను మరో కోనసీమలా మార్చారు. పులివెందులకు నీళ్లిచ్చిన తరువాతనే కుప్పానికి నీళ్లు తీసుకుపోతామని అప్పట్లో చంద్రబాబు చెప్పారు. చెప్పినట్లుగానే ప్రాజక్టులు పూర్తిచేసి పులివెందులకు చంద్రబాబు నీళ్లు ఇచ్చారు. అప్పట్లోనే పల్లెపల్లెకూ ప్రాజెక్టుల నుంచి 24గంటలు తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్‌కు అంకురార్పణ చేశారు. 2019కి మునుపే జిల్లాలో రూ.1000 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ వాటర్‌గ్రిడ్‌ను అటకెక్కించింది.

జగన్ హయాంలో 30 శాతం దాటని పనులు

జగన్ అధికారంలోకి వచ్చాక పులివెందుల నియోజకవర్గంలో రూ.480 కోట్లతో కేంద్ర, రాష్ట్ర నిధులతో జలజీవన్ నిధులతో వాటర్‌గ్రిడ్‌కు శ్రీకారం చుట్టారు. హైదరాబాదుకు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ పనులు దక్కించుకుంది. ఆ నియోజకవర్గంలోని లింగాల, తొండూరు, సింహాద్రిపురం, పులివెందుల, వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల్లోని ప్రజలకు, విద్యాసంస్థలకు నీళ్లిచ్చేలా పనులు చేపట్టారు. మొత్తం 5,36,821 మందికి తాగునీరు అందించాలనేది లక్ష్యం. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 3,85,816 జనాభా, మున్సిపాలిటీలో 1,16,005, విద్యాసంస్థల్లో 35వేల మందికి నీరందించేలా పనులు మొదలుపెట్టారు. ప్రతి ఒక్కరికీ రోజుకు వంద లీటర్ల నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం వాటర్‌ట్యాంకులు, సంప్‌లు ఏర్పాటు చేశారు. అయితే జగన్ హయాంలో ఈ పనులన్నీ కేవలం 30శాతంలోపే జరిగాయి.

> **20 లోపు వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి**
>
> 
>
> పులివెందుల నియోజకవర్గంలో వాటర్‌గ్రిడ్ పనులను ఈ నెల 20లోపు పూర్తిచేయాలని డెడ్‌లైన్ పెట్టుకున్నాం. ఆ దిశగా పనులు జరుగుతున్నాయి. అయితే చక్రాయపేట నుంచి జాతీయ రహదారి పనుల కారణంగా కొంచెం ఆలస్యమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తాం. వాటర్‌గ్రిడ్ పనులు నేను వచ్చేసరికి 30శాతం మాత్రమే అయ్యాయి. ఆ పనులు ప్రస్తుతం చివరి దశకు వచ్చాయి. సీఎం చంద్రబాబుతో వాటర్‌గ్రిడ్ ప్రారంభిస్తాం.
>
> - శ్రీధర్ చెరుకూరి, కలెక్టర్

పులివెందులకు నీళ్లంటే.. చంద్రబాబే

జగన్ సీఎం అయ్యాక సరికొత్త ట్రెండ్ తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు పూర్తిచేస్తే ఆ పేరు తనకు రాదనుకుని.. 2014-19లో చంద్రబాబు చేపట్టిన పనులన్నీ రద్దు చేసి తన మార్కు పాలన చూపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జగన్‌లా కక్ష సాధింపు చేపట్టకుండా పులివెందులలో వాటర్‌గ్రిడ్ పనులను పూర్తి చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పులివెందుల వాటర్‌గ్రిడ్ విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి చంద్రబాబు దృష్టికి తెచ్చారు. అభివృద్ధి పనులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు జగన్‌లా కక్ష సాధించకుండా "పులివెందులకు నేనే సాగునీళ్లిచ్చా.. ఇప్పుడు తాగునీరు ఇస్తా.. వాటర్‌గ్రిడ్ పనులను పూర్తిచేద్దాం" అని చెప్పారు. అదే సమయంలో కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్ వచ్చారు. సీఎం విజన్‌కు అనుగుణంగా జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగానే సీఎం ఆదేశాల మేరకు పులివెందుల వాటర్‌గ్రిడ్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. త్వరితగతిన పూర్తయ్యేందుకు కాంట్రాక్టర్లతో మీటింగ్ పెట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1110 కి.మీ పైపులైనుకు గాను సుమారు 950 కి.మీ పూర్తి చేశారు. పులివెందులకు సీఎం చంద్రబాబే సాగునీరు అందించారు. ఇప్పుడు వాటర్‌గ్రిడ్ కూడా చంద్రబాబు చేతులతో ప్రారంభించాలని నిర్ణయించారు. వచ్చే నెలలో వాటర్‌గ్రిడ్‌ను ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

11న మేయర్ ఉప ఎన్నిక

- షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఉప ఎన్నికను ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్ని ఉత్తర్వుల ప్రకారం.. 7వ తేదీ లోపు మేయర్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం, 11వ తేదీ ఉదయం 11గంటలకు కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్నిక నిర్వహించాలి. ఈ మేరకు కార్పొరేటర్లకు, ఎక్స్ అఫిషియో సభ్యులకు నోటీసు అందజేయాలి. 11న మేయర్ ఎన్నిక పూర్తికాకపోతే, మరుసటి రోజు ఎన్నిక జరుగుతుంది. ఆ రోజున కూడా మేయర్ ఎన్నిక పూర్తికాకపోతే, తదుపరి తేదీని నిర్ణయించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించాలని ఆదేశాలు జారీ చేశారు.

23 మంది ఎస్‌ఐల బదిలీ

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 23 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు తమకు కేటాయించిన పోలీసుస్టేషన్‌లో వెంటనే బాధ్యతలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
ఆర్.శివనాగిరెడ్డి	ప్రొద్దుటూరు	వల్లూరు
జి.ప్రణయ్‌కుమార్‌రెడ్డి	ఒంటిమిట్ట	ఆర్‌కే వ్యాలీ
జి.సూర్యనారాయణరెడ్డి	వీఎన్‌పల్లె	బి.కోడూరు
డి.అనిల్‌కుమార్	లింగాల	ప్రొద్దుటూరు
ఎం.సుభాన్	పులివెందుల	కలసపాడు
డి.జగదీశ్వర్‌రెడ్డి	దువ్వూరు	లింగాల
ఎం.నాగకీర్తన	రాజుపాలెం	అట్లూరు
ఎం.ప్రదీప్‌కుమార్	వీఆర్, కడప	కడప వన్‌టౌన్
ఎస్.మహ్మద్‌రఫి	వీఆర్, కడప	కడప టూటౌన్
యువై జయరాములు	కడప ట్రాఫిక్	బద్వేలు
ఎస్.మహబూబ్‌బాషా	వీఆర్, కడప	ప్రొద్దుటూరు టూటౌన్
టీవీఎన్ చిరంజీవి	వీఆర్, కడప	మైదుకూరు
బి.పెద్దఓబన్న	వల్లూరు	డీఎస్‌బీ, కడప
ఎల్.తిమోతి	కలసపాడు	పులివెందుల
బి.రామక్రిష్ణ	అట్లూరు	కడప టూటౌన్ పీఎస్
ఎం.సిద్దయ్య	కడప టూటౌన్	కడప ట్రాఫిక్
పి.ప్రతాప్‌రెడ్డి	కడప వన్‌టౌన్	డీటీసీ, కడప
కె.జయరామిరెడ్డి	బద్వేలు	డీటీఆర్‌బీ, కడప
ఎస్.సుబ్బారావు	మైదుకూరు	డీసీఆర్‌బీ, కడప
కేపీబీ వెంకటరెడ్డి	ప్రొద్దుటూరు త్రీటౌన్	పీసీఆర్, ప్రొద్దుటూరు
ఎం.విష్ణునారాయణ	ఎర్రగుంట్ల	పులివెందుల ట్రాఫిక్
డీఎన్ శేషశయనరావు	వీఆర్, కడప	ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్, కడప
వి.నారాయణ	పులివెందుల	సైబర్ క్రైం, కడప

33 మంది రేషన్ డీలర్లకు నోటీసులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆప్షన్‌ను దుర్వినియోగం చేసిన 33 మంది రేషన్ డీలర్లకు తహశీల్దారు గంగయ్య గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇళ్లవద్దకే వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని రేషన్ పంపిణీ చేసేందుకు ప్రతినెల 26 నుంచి 30 వరకు ఇచ్చిన ఆన్‌లైన్ అవకాశాన్ని రేషన్ డీలర్లు దుర్వినియోగం చేస్తున్నారు. మామూలు కార్డుదారులకు సైతం బయోమెట్రిక్ తీసుకుని రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో 'పేదల బియ్యం పక్కదారి' అనే శీర్షికన గత నెల 7 కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి తహశీల్దారు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లు, డీలర్లతో సమావేశం నిర్వహించి వృద్ధుల ఆప్షన్‌ను దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా తిరిగి నవంబరు 26 నుంచి 30 వరకు 33 మంది డీలర్లు మామూలు కార్డుదారులకు కూడా బియ్యం వేసినట్లు ఆన్‌లైన్ చేశారు. దీంతో గురువారం వీరందరికీ తహశీల్దారు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా.. కార్డుదారులకు డబ్బులు ఇచ్చి బియ్యం కొనుగోలు చేసే డీలర్లపై కేసులు నమోదు చేయకుండా షోకాజ్ నోటీసులతో సరిపుచ్చడంపై విమర్శలు వస్తున్నాయి.


కూటమిలో పీఆర్ వ్యవస్థ బలోపేతం

- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

కడప రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను మరింతగా బలోపేతం చేసి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని 77 డివిజన్లలో డీడీవో నూతన కార్యాలయాలను ప్రారంభించారు. ఈ మేరకు జడ్పీ ఆవరణలోని డీడీవో కార్యాలయ ప్రారంభానికి ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో డివిజన్ స్థాయిలో పరిపాలనను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ మేరకు జడ్పీ, డీపీవో, డ్వామా డివిజనల్ స్థాయి అధికారులను సమన్వయం చేసి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. డీడీవో నూతన కార్యాలయాలను అన్ని వసతులతో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు, రాజంపేట, రాయచోటి డివిజన్లలో డీడీవో కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, డీఎల్పీవో విజయకుమార్, ఎంపీడీవోలు కుళాయిబాబు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గవంక నుంచి నీరు విడుదల



సీకేదిన్నె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక ప్రాజెక్టు నుంచి 150 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు బుగ్గవంక ఇంజనీర్ జిలానీ తెలిపారు. డ్యాంలోకి వర్షాల వలన నీరు వస్తుండడంతో 250 క్యూసెక్కుల నీటిని గురువారం ఉదయం విడుదల చేయగా సాయంత్రానికి 150 క్యూసెక్కులకు తగ్గించినట్లు తెలిపారు. బుగ్గవంక పరివాహక ప్రాంత ప్రజలు వంకలోకి దిగరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు నాగేశ్వరరావు, ఇంజనీర్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బుగ్గవంక డ్యాం గేటు నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

పాఠశాలలకు విద్యా బోధకులు

- జిల్లాకు 54 పోస్టులు మంజూరు
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- 8 నుంచి విధుల్లో చేరేలా సన్నాహాలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న స్థానంలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టరను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీరిని తాత్కాలిక పద్ధతిలో నియమించనున్నారు. ఇటీవల మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరత దాదాపు అధిగమించినప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది కంటే విద్యార్థుల సంఖ్య పెరగడం, కొందరు ఉపాధ్యాయులు పదవీ విరమణ చెందడంతో కొన్నిచోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఎస్జీటీలు 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి జిల్లాలో తెలుగు 5, ఉర్దూ 4, ఇంగ్లీష్ 3, గణితం (ఉర్దూ) 1, ఫిజికల్ సైన్స్ 2, ఫిజికల్ సైన్స్ (ఉర్దూ) 4, బయలాజికల్ సైన్స్ 6, బయలాజికల్ (ఉర్దూ 3), సోషల్ స్టడీస్ 7, సోషల్ స్టడీస్ (ఉర్దూ) 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో మొత్తం 54 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తాత్కాలికంగా నియమించేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌స్ట్రక్టర్లకు స్కూల్ అసిస్టెంట్లకు రూ.12,500, ఎస్జీటీలకు రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. శుక్రవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 75 శాతం అకడమిక్, 5 శాతం బీఈడీ వెయిటేజ్ ఇవ్వనున్నారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కోసం జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ సెలక్షన్ కమిటీ కార్యదర్శిగా డైట్ ప్రిన్సిపల్ సభ్యులుగా ఉంటారు. ఈనెల 7వ తేదీలోగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తారు. ఎంపికైన వారు ఈనెల 8వ తేదీ నుంచి విధుల్లో చేరనున్నారు. వీరు వచ్చే ఏడాది మే నెల 7వ తేదీ వరకు విధుల్లో కొనసాగనున్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో షంషుద్దీన్ కోరారు.

రైతులకు రుణాలు అందించాలి : కలెక్టర్




డీసీసీ రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అధునాతన సాంకేతికతకు అవసరమైన పెట్టుబడుల కోసం రైతులకు బ్యాంకర్లు రుణసహకారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. డీఆర్డీయే, మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అర్హులైన యువపారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు.

యువశక్తి..!





మనదేశంలో యువత అధికంగా ఉన్నారని అదే మన బలమని ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదేపదే చెబుతున్నారు. కొందరు యువకులు మాత్రం ఏ మాత్రం బాధ్యతలేకుండా బలాదూర్‌గా ఉంటున్నారు. కడప నగర శివారులోని సరోజినినగర్‌లో శిథిలావస్థలో ఉన్న 30 అడుగుల ఎత్తున్న నీళ్ల ట్యాంకుపైకి ఎక్కి యువకులు సెల్‌ఫోన్లతో ఫొటోలు తీసుకుంటున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సున్నంలోకి ఎముకలు కూడా మిగలవు. పోలీసులు డ్రోన్లతో నిఘా పెడుతున్నా.. ఇలా ట్యాంకులపైకి ఎక్కి వీరు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

అట్టహాసంగా ఆరాధనోత్సవాలు

- కాశినాయన దర్శనానికి బారులుతీరిన భక్తులు


భక్తులతో రద్దీగా ఉన్న అన్నదాన కౌంటర్లు



అన్నదానానికి బియ్యం ప్యాకెట్లు తెస్తున్న భక్తులు

కాశినాయన, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీపంలోని జ్యోతిక్షేత్రంలో గురువారం కాశిరెడ్డినాయన 30వ ఆరాధనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామునే ఆలయ పురోహితుడు జీరయ్య స్వామి ఆధ్వర్యంలోని పురోహితుల బృందం కాశిరెడ్డినాయన సమాధిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. జ్యోతిక్షేత్రం కాశినాయన నామస్మరణతో మార్మోగిపోయింది. రాత్రికి కోలాటాలు, భజనలు పెద్దఎత్తున సాగాయి. స్వామివారి తేరు ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. ఆరాధనకు వచ్చిన వేలాది భక్తులకు రుచికరమైన భోజనాలను పెట్టారు. ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందిన శివారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 40 మంది వలంటీర్లు అన్నం వడ్డించడం, పరిసరాలను శుభ్రపరిచే పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో కూడా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల్లో చాలామంది తాము పండించిన పంటలో మొదటి బాగాన్ని కాశినాయన నిత్యాన్నదానానికి విరాళంగా అందించగా మరి కొంతమంది నగదు రూపంలో విరాళాలు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ యోగేంద్ర పర్యవేక్షణలో 150 మంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టారు. మండల వైద్యాధికారి డాక్టర్ పుష్ప ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గిద్దలూరు, మైదుకూరు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల నుంచి 35 ఆర్టీసీ బస్సులు భక్తులకు సేవలు అందజేస్తున్నాయి. బద్వేలు టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, వైసీపీ నేత ఎన్.విశ్వనాథరెడ్డి కాశినాయన ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో కాశినాయన పాలరాతి సమాధి

శనగకు ముసురుకుంది

- 45,961 హెక్టార్లలో సాగు
- ముసురు వానతో కుళ్లుతున్న మొక్కలు


రాజుపాలెం మండలంలో శనగ పొలంలో వర్షం నీరు

దిత్వా తుఫాను కారణంగా ఆరు రోజుల నుంచి వాతావరణం ముసురేసింది. జిల్లాలో భారీ వర్షాలు లేకపోయినా ఆదివారం తెల్లవారు జామునుంచి ముసురు వాన కురుస్తోంది. ఇది శనగ పంటపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. ఒకటి రెండు రోజులు ఇలానే ఉంటే పంట పూర్తిగా కుళ్లిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కడప రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సకాలంలో కురవని వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తాజాగా రబీలోను అధిక వర్షాలు బుడ్డశనగ రైతన్నను కొంపముంచుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వానతో శనగపంట దెబ్బతింటోంది. ఈ ఏడాది రబీలో బుడ్డశనగ 79,613 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఎన్నో వ్యయప్రయాసాలతో జిల్లాలోని 21 మండలాల్లో 45,961 హెక్టార్లలో విత్తనాలు వేశారు. పంట వేసినప్పటి నుంచి వర్షాలు వస్తుండడంతో మొలకెత్తిన వారం పదిరోజులకే అధిక తేమతో కుళ్లుతున్నాయి.

ఎకరానికి రూ.20వేలు ఖర్చు

ఒక ఎకరా బుడ్డశనగ సాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి రూ. 15వేల నుంచి రూ.20 వేల వరకు రైతులు ఖర్చుచేశారు. ఇలా దాదాపు 1.15లక్షల ఎకరాలలో పంటను సాగుచేశారు. పంట వేసిననాటి నుంచి భూమిలో తేమ ఆరడంలేదు. పైగా ముసురువాన కురుస్తూనే ఉంది. భూమిలో తేమ శాతం అధికమై మొక్కలు కుళ్లిపోతున్నాయి. పంటకు తగిన మోతాదుతో తేమ, ఉష్ణోగ్రత ఉండింటే ఈ పాటికి పంట కళకళలాడేది. కానీ అవసరానికి మించి తేమ ఉండడంతో పంట ఎదుగు బొదుగులేకుండా ఉంది. ఇకపై వర్షాలు లేకపోయినప్పటికీ దిగుబడులు పెద్దగా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శనగ సాగు ఇలా..

మండలం	హెక్టార్లు
పెద్దముడియం	1,0753.4
జమ్మలమడుగు	5,758
యర్రగుంట్ల	5,437.6
వీరపునాయునిపల్లె	5,139
రాజుపాళెం	4,524
సింహాద్రిపురం	3,404
కొండాపురం	2,115
కమలాపురం	1,821
వల్లూరు	1,696
వేముల	1,020
వేంపల్లి	938.6
ముద్దనూరు	682.56
పెండ్లిమర్రి	589
మైలవరం	552
పులివెందుల	488
ప్రొద్దుటూరు	340
తొండూరు	334.8
లింగాల	265
కాశినాయన	50
దువ్వూరు	46
బి.కోడూరు	8

ఆస్తుల కోసం వేధిస్తున్నారు

- కోడలు, మనవరాళ్లతో ప్రాణహాని
- రక్షణ కల్పించాలని వృద్ధ దంపతుల వేడుకోలు



మాట్లాడుతున్న వృద్ధ దంపతులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం కోడలు, మనవరాళ్లు వేధిస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కుమార్తె కమలతో కలిసి వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కురబలకోట మండలం తెట్టు గ్రామం, గుంతపల్లె వంకకు చెందిన తాను కరెంటు ఆఫీసులో అటెండర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందానన్నారు. తమకు సుధాకర్, సురేష్‌కుమార్, కవల పిల్లలని వీరిలో సుధాకర్ వివాహం కాకనే చనిపోగా, రెండో కుమారుడు సురేష్ కుమార్ ఏడాది కింద చనిపోయాడని తెలిపారు. కుమార్తె కమల పట్టణంలోని కనకదాస్ నగర్‌లో ఉంటోంది. కాగా సురేష్‌కు పుట్టిన ముగ్గురు ఆడపిల్లలకు పెన్షన్‌తోనే చదివించి ఆలనా పాలనా చూశామని కొడుకు చనిపోగానే కోడలు మంజుల, మనవరాళ్లు మానస, పావని, నవ్యశ్రీ తమ ఆస్తి కోసం పాకులాడుతున్నారని ఆరోపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తాము కొన్నేళ్లుగా నీరుగట్టువారిపల్లె, మాయాబజారులో సొంత ఇంట్లో ఉండేవారమని గొడవలు పెట్టుకుని గెంటేయడంతో స్వగ్రామం గుంతలవంకకు వెళ్లామన్నారు. రెండు రోజుల క్రితం కోడలు, మనవరాళ్లు వచ్చి పొలాలు, ఇళ్లు రాసి ఇవ్వాలని బెదిరించారని ఆరోపించారు. సొంత ఊళ్లో దాయాదుల భూమి భాగ పరిష్కారం కాలేదని, కనకదాస్ నగర్‌లో ఉండే ఇంటికి ఆక్రమించుకుని కోడలు బాడుగకు ఇచ్చిందని ఆ ఇల్లు తమకు ఇప్పించాలని వేడుకున్నారు. వేధింపులకు గురి చేస్తే పల్లె వద్ద ఉన్న ఎనిమిదెకరాల పొలం, ఇల్లు అనాథ శరణాలయానికి రాసి ఇచ్చేసి మేము కూడా అక్కడికే వెళ్లిపోతామన్నారు. అధికారులు స్పందించి మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

రాచవేటివారిపల్లిలో దొంగల హల్‌చల్

- డబ్బు, నగలు చోరీ



చిందరవందరగా వేసిన బీరువాలోని వస్తువులు

నిమ్మనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాచవేటివారిపల్లి పంచాయతీ గారబురుజులో బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, బంగారాన్ని దోచుకెళ్లినట్లు ఇంటి యజమాని మంచూరి వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవినాయక్, ఎస్‌ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డితో ఆయన భార్య కళావతి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీరికి రెండు ఇళ్లు వుండగా ఒక ఇంట్లో నిద్రిస్తూ మరో ఇంటికి తాళాలు వేసేవారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు మేల్కొని వుండి అనంతరం ఒక ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో పడుకున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు రాత్రి 12 గంటల పైన తాళం వేసిన ఇంటి తాళాలు తెరిసి బీరువా తాళానికి పెట్రోల్ పోసి నిప్పుపెట్టి అందులో ఉన్న 10 గ్రాముల బంగారం, రూ.95 వేల నగదు దోచుకెళ్లారు. గురువారం ఉదయం వేణుగోపాల్‌రెడ్డి నిద్ర లేచి చూడగా అప్పటికే ఇంటి తాళం తీసి ఉండడంతో ఇంట్లోని బంగారం, డబ్బు లేకపోవడంతో వెంటనే పోలీసులకు విషయాన్ని తెలుపగా వారు క్లూస్ టీంతో వచ్చి ఇంటి పరిసరాలను తనిఖీ చేసి చుట్టుపక్కల వారిని విచారించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి వచ్చి వుంటారని అనుమానిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డీడీవోలతో మరింత బలోపేతం



డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన డివిజినల్ అభివృద్ధి అధికారులతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. గురువారం మదనపల్లె డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఒక గౌరవం తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కే చెందుతుందన్నారు. ఆయన నమ్మకానికి అనుగుణంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ సెక్రటరీలు పనితీరు మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు సేవలందించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచుల భాగస్వామ్యంతో పాలన అందించాలే కాని సర్పంచులు చెప్పిందల్లా చేయకూడదని హితవు పలికారు. డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ డీడీవో పర్యవేక్షణలో డివిజన్ అభివృద్ధికి అందరం కలసికట్టుగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో 11 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, జేవీ రమణ, పెంచుపాడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా చిన్నపోతుల ప్రాజెక్టు

- మొరవ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు చేస్తే రెండు వేల ఎకరాలకు సాగునీరు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో నీటి నిల్వ చేసి సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీరందించే లక్ష్యంతో 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చిన్నపోతుల ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు అందుతుంది. అయితే ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈ ప్రాజెక్టు కుడి,



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కుడి కాలువ



నీటితో కళకళలాడుతున్న చిన్నపోతుల ప్రాజెక్టు



దెబ్బతిన్న ప్రాజెక్టు మొరవ

ఎడమ కాలువల ద్వారా కోనంపేట, బి.యర్రగుడి మామిడిగారిపల్లె, పాలెంగొల్లపల్లె, చెంచర్లపల్లి, నల్లగుట్టపల్లి గ్రామాల్లోని పొలాలకు నీరు చేరేవి. అలాంటి కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎడమ కాలువ పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. ప్రాజెక్టు నిండితే మొరవ ద్వారా నీరు వెళ్లి రామరాజు వంకకు చేరుకుని రామాపురం మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరుతుంది. ఇలాంటి పెద్ద ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. దీనికి తోడు గండికోట నుంచి చక్రాయపేట మండలం కాలేటివాగు నుంచి చిన్నపోతుల ప్రాజెక్టుకు పైపులైన్ ద్వారా నీరు అందించేందుకు గతంలో అధికారులు అంచనాలు వేసి పనులు కూడా ప్రారంభించారు. అయితే ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. శేషాచలం అడవుల్లో కురిసిన వర్షపునీరు చిన్నపోతుల ప్రాజెక్టుకు చేరుకుంటుంది. మొరవ దెబ్బతినడంతో కుడి, ఎడమ కాలువలు తెగిపోయాయి. మొరవ కొట్టుకుపోయిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తే వేసవిలో కూడా ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటుంది. చుట్టూ ఉన్న గ్రామాల్లోని బోర్లకు నీరు తగ్గకుండా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టు కల్వర్టుతో పాటు కుడి, ఎడమ కాలువలు కాలువలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



చిన్నపోతులపల్లి ప్రాజెక్టు మొరవ, కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేస్తే ఎండాకాలంలో కూడా ఉంటాయి. మూడుకార్ల పంటలు పండించుకోవచ్చు. అధికారులు స్పందించి కల్వర్టు కుడి, ఎడమ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- వెంకట్రమణ, చిన్నపోతులపల్లి

ఎవరూ పట్టించుకోలేదు



1990లో నిర్మించిన చిన్నపోతుల ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోలేదు. వచ్చిన నీరంతా వృథాగా పోతోంది. కనీసం 100 ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందడం లేదు.

- వేణుగోపాల్, చిన్నపోతులపల్లి ప్రాజెక్టు చైర్మన్

విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకం : డీఈవో



పదో తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని డీఈవో కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో కూడా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతుందని, హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యూటీఎఫ్ రాణిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం ఒక్క యూటీఎఫ్‌కు మాత్రమే సాధ్యమన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోడల్ పేపర్స్ కావాల్సినవారు 9440181800, 9849534690 నెంబర్లతో పాటు ఆయా ప్రాంతాల్లోని యూటీఎఫ్ నాయకత్వాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, జిల్లా కార్యదర్శి దావూద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అమీన్, రఫీక్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఇమ్రాన్, రాజారమేశ్, రియాజ్, బసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం మన జిల్లా పరిధిలో ఇప్పటికే 289 నమూనాలు సేకరించామని ఇందులో కేవలం 39 పాజిటివ్ కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ వ్యాధి తీవ్రమైనది కాదని, ఇందుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. బ్యాక్టీరియా కుట్టిన చోట నలుపు రంగులోకి మారి మచ్చగా ఏర్పడుతుందని, దీనివల్ల అధిక జ్వరం, తలనొప్పి, అధిక నొప్పులు, వైరల్ జ్వరంగా మారే అవకాశాలు ఎక్కువ కావున మూడు రోజులుగా పైబడి ఉంటే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నయం అవుతుందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

జాతీయ జంబోరీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్నోలో గత నెల 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు, విద్యార్థులను గురువారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం అభినందించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జాతీయ జంబోరీలో నేపాల్, శ్రీలంక, సౌదీ అరేబియా దేశాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు 35 వేల మంది పాల్గొనగా జిల్లా నుంచి 62 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో జిల్లా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. గురువారం జిల్లాకు చేరుకున్న విద్యార్థులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆరమడక గ్రామానికి చెందిన శ్రీనాథ్ (38) స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తూ మార్గమధ్యలో కూరపర్తి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు.

తీవ్రంగా గాయపడిన శ్రీనాథ్‌ను గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం తెలియజేశారు.

పట్టాలపై మద్యం తాగుతుండగా రైలు దూసుకెళ్లి ఇద్దరు మృతి



వీరభద్రయ్య, మునికుమార్ (ఫైల్)

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై మద్యం తాగుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన కలికిరి రైల్వేస్టేషను వద్ద బుధవారం రాత్రి జరిగింది. కదిరి రైల్వే పోలీసు ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. గుట్టపాళెం గ్రామం ఆచార్ల కొత్తపల్లెకు చెందిన జి.వీరభద్రయ్య (49) కలికిరి పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులో కాపురముంటున్నాడు. ఇతను ఇళ్ల బాడుగలతో జీవనం సాగిస్తున్నాడు. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్ (27) కలికిరిలోని ఏఎన్‌ఆర్ కాలనీలో నివాసముంటూ దోబీ పని చేస్తున్నాడు. ఇద్దరూ స్నేహితులు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరూ కలిసి మద్యం తాగేందుకు రైల్వే స్టేషను వద్దకెళ్లారు. అక్కడున్న సెక్యూరిటీ అడ్డు చెప్పడంతో స్టేషను తూర్పు వైపు వచ్చి పట్టాల మధ్యలో కూచుని మద్యం తాగుతుండగా అదే సమయంలో ముంబాయి-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ వేగంగా వెళ్లింది. పట్టాల మధ్యలో ఉన్న ఇద్దరూ తునాతునకలయ్యారు. రైలు లోకోపైలట్ జగదీశ్ దీనిని గమనించి సీటీఎం రైల్వేస్టేషన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆ వెంటనే వారిచ్చిన సమాచారంతో కదిరి రైల్వే పోలీసులు కలికిరి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతుల తండ్రులు లింగయ్య, చంద్రయ్య వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆత్మహత్య సంఘటనగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. మృతుడు వీరభద్రయ్యకు ఇద్దరు ఇంజినీరింగ్ చదువుతున్న పిల్లలున్నారు. మునికుమార్‌కు రెండేళ్ల కుమారుడున్నాడు. మృతదేహాలకు శవపరీక్షలు పూర్తి చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా వీరిద్దరూ మద్యానికి బానిసలయ్యారని స్థానికులు చెబుతున్నారు. సంఘటనకు ముందు కూడా మునికుమార్ భార్య శ్రీదేవి రైల్వేస్టేషను వద్దకు వెళ్లి భర్తను ఇంటికి రావాలని ప్రాధేయ పడినట్లు సమాచారం.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి...



వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు ట్రాన్స్‌ఫార్మర్‌పై కూర్చుని హల్‌చల్ చేసిన సంఘటన గురువారం వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని గజ్జలవారిపల్లెలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి లైట్లను, విద్యుత్ లైన్లు మార్చే దిశగా ట్రాన్స్‌కో సిబ్బంది పనులు చేపట్టారు. అయితే వీధిలైట్లకు సంబంధించిన వస్తువులను తీసుకెళ్లాడని నాగార్జున అనే యువకుడిని పంచాయతీ సెక్రటరీ ప్రశ్నించాడు. మద్యం మత్తులో ఉన్న నాగార్జున తననే అనుమానించి ప్రశ్నిస్తావా అంటూ సెక్రటరీని బెదిరించి ఆపై విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్‌పై గొడుగు పట్టుకుని కూర్చోవడమే కాక బిగ్గరగా కేకలు వేస్తూ ట్రాన్స్‌కో సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశాడు. ఆ సమయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని గమనించిన గ్రామస్థులు ఎంత చెప్పినా యువకుడు వినకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న నాగార్జునను కిందికి దింపి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో గ్లోబల్ ఆసుపత్రి సీజ్

మదనపల్లె/మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ మార్పిడి కేసులో పోలీసులు గురువారం ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రిలో సోదాలు చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రితోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్‌కు ఉపయోగించిన పరికరాలు, మందులను స్వాధీనం చేసుకుని ఆసుపత్రితో సహా సీజ్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గత నెల 9వ తేదీ జరిగిన ఈ సంఘటనలో ఆసుపత్రి అధినేత, అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ కె.ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు.

అనంతరం ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రధానపాత్ర పోషించిన డాక్టర్ ఆంజనేయులుతో పాటు మదనపల్లె డయాలసిస్ కేంద్రంలో పనిచేస్తున్న మేనేజరు బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్ర మేనేజరు మెహరాజ్, విశాఖకు చెందిన పిల్లి పద్మ, కాకర్ల సత్య, సూరిబాబు, కిడ్నీ మార్పిడి చేసిన బెంగళూరుకు చెందిన డాక్టర్ పార్థసారధిరెడ్డికి సహకరించిన కడపకు చెందిన అనుచరులు కొండయ్య, సుమన్‌లను రెండు విడతలుగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇదే కేసులో మరో ఆరుగురిపై కేసు నమోదైంది. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుండగా, గురువారం జరిగిన ప్రక్రియలో డీఎస్పీతో పాటు వన్, టూటౌన్ సీఐలు ఎస్.మహ్మద్‌రఫీ, రాజారెడ్డి, ఎస్‌ఐ రహీముల్లా, మదనపల్లె పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీధర్, ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్లోబల్ ఆస్పత్రి వద్ద డీఎస్పీ మహేంద్ర, తదితరులు

ఆంజనేయులే ప్రధాన నిందితుడు

జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్తగా ఉంటూ మానవఅవయవాల అక్రమ మార్పిడిలో ఆంజనేయులు ప్రధాన నిందితుడని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్యులైన ఆయన కుమారుడు డాక్టర్ అవినాశ్, కోడలు శాశ్వతిపై కూడా కేసు నమోదైనట్లు తెలిసింది. అలాగే గ్లోబల్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన ఆంజనేయులు భార్యపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆసుపత్రి ఎవరి పేరుపై ఉందో ఆ వివరాలు ఇవ్వాలని పోలీసులు ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. అధికారిక సమాచారం వచ్చాక ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన వారిపై కూడా కేసు నమోదు చేయనున్నారు. ఇదిలా వుండగా సంఘటన జరిగిన 9వ తేదీ ఆసుపత్రి నుంచి సీసీ ఫుటేజీ, హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్‌ఎఫ్‌ఎల్ రిపోర్టుకు పంపించగా ఇటీవల నివేదిక వచ్చినట్లు తెలిసింది. ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఎన్ని రోజులుగా జరుగుతోంది. ఎంతమందికి చేశారు. అందులోని కిడ్నీ దాత, రిసీవర్‌లు ఎవరు? శస్త్రచికిత్సలు చేసిందెవరన్నది స్పష్టమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన యమున (29)కు జరిగిన కిడ్నీ మార్పిడి కంటే ముందు మరొకరికి కూడా చేశారు. ఇందులో ఇద్దరు రిసీవర్‌లు, ఒక డోనర్ బెంగళూరు ఆసుపత్రులలో కోలుకుంటుండగా, యమున మాత్రం అదేరోజు ఇక్కడి ఆసుపత్రిలో మృతి చెందడంతో కిడ్నీ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

కోర్టులో లొంగిపోయిన డాక్టర్ పార్థసారథి



కిడ్నీ రాకెట్ కేసులో ఏ-2 డాక్టర్ పార్థసారథి గురువారం రాత్రి మదనపల్లె సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయాధికారి ముందు లొంగిపోయాడు. దీంతో నిందితుడికి రిమాండ్ విధించారు. పులివెందులకు చెందిన డాక్టర్ పార్థసారథి బెంగళూరులో ఉంటున్నాడు. కిడ్నీ మార్పిడి కేసులో నిందితుడిగా ఉన్న ఇతను పరారీలో ఉన్నాడు. పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో నిందితుడే స్వయంగా కోర్టులో లొంగిపోయాడు. వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

బీపీఎస్, ఎల్‌వోఎస్ పథకాలకు అనుమతి

- రీజనల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజీవకుమారన్



అధికారులకు సూచనలు ఇస్తున్న రీజనల్ డైరెక్టర్

మదనపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర, పట్టణాల్లోని ప్రజలకు ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్), ల్యాండ్ కన్వర్షన్ స్కీమ్ (ఎల్‌వోఎస్) పథకాలకు అనుమతి ఇచ్చిందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, టౌన్, కంట్రీ ప్లానింగ్ (అనంతపురం) అధికారి సంజీవకుమారన్ తెలిపారు. వీటిపై పట్టణాల్లో వినియోగదారులకు అవగాహన, చైతన్యం కల్గిస్తూ వీలైనంతమంది సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్డీ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మదనపల్లె, రాయచోటి, పుంగనూరు మున్సిపాలిటీలు సహా బి.కొత్తకోట నగర పంచాయతీ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఆర్డీ మాట్లాడుతూ 1985 నుంచి 2025 వరకు నిర్మించిన అన్ని భవనాలకూ బీపీఎస్ పథకం వర్తిస్తుందన్నారు. అనుమతి కన్నా అదనంగా, అక్రమంగా నిర్మించిన ఫ్లోర్లు, ఇతర నిర్మాణాలను సక్రమం చేసుకునేందుకు ఇదొక సువర్ణావకాశమన్నారు. సెట్‌బ్యాక్, ఓపెన్‌సైట్‌లకు కూడా వర్తిస్తుందన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాలని, ఏదైనా నిర్మాణానికి అసెస్‌మెంట్, డోర్ నెంబర్‌తో పనిలేకున్నా, వేకెన్సీ ల్యాండ్ ట్యాక్సు (వీఎల్‌టీ) ప్రాతిపదికన దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని కూడా ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు పొడిగించిందని ఆర్డీ ప్రకటించారు. ఇదివరకే ఉన్న ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్ చార్జీలను 14 శాతం నుంచి ఏడు శాతానికి ప్రభుత్వం తగ్గించిందని, నిర్ణీత గడువులోగా ఆ లేఅవుట్‌లో ఏదో ఒక ప్లాటు రిజిస్ట్రేషన్ అయి ఉంటే అర్హతగా తీసుకుంటామని ఆర్డీ వివరించారు. సమావేశంలో మదనపల్లె మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, టౌన్‌ప్లానింగ్ అధికారి చిన్నరెడ్డెమ్మ, రాయచోటి, పుంగనూరు, బి.కొత్తకోట పట్టణ ప్రణాళిక అధికారులు, వార్డు ప్లానర్స్ ప్రైవేటు లైసెన్స్ ప్లానర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడి ప్రతిభ



కామిశెట్టి వెంకట్

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్ ప్రతిభ కనపరిచారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో శ్లోకాలు, పాటలు పడి ఆకట్టుకున్నాడు. అలాగే నృత్యం, సినిమా డైలాగ్లు, లిప్‌రీడింగ్, కర్ణాటక సంగీత గీతాలాపన, పేరడీ పాటలతో అలరించాడు. ఒకే వ్యక్తి విభిన్న కళలను ప్రదర్శించడంతో ఆహుతులు కామిశెట్టి వెంకట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కామిశెట్టి వెంకట్ తల్లి విశాలాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఉత్సవాల్లో విభిన్న ప్రతిభావంతులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని కోరారు.

చివరి మజిలీకి... ఎన్ని తిప్పలో!

- శ్మశానవాటికకు రహదారి లేక నానా అవస్థలు





బురదలో చేతులపై పాడె తీసుకెళుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు సరైన దారి లేక ఆఖరి మజిలి ఓ పరీక్షగా మారింది. బురద నేలలో, ముళ్లపొదల్లో మృతదేహాన్ని భుజాలపైన మోసుకెళ్లేందుకు వీలు లేక చివరకు చేతుల మీదుగా తీసుకెళ్లాల్సి దుస్థితి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోనున్న లింగాపురం గ్రామంలో సుమారు రెండు వేల మంది జనాభా ఉన్నారు. ఇక్కడి వారికి శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన దారి లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. గురువారం ఓబన్న అనే వ్యక్తి గుండె సమస్యతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని శ్మశానవాటిక తీసుకువెళ్లేందుకు అతని కుటుంబ సభ్యులు నానా తిప్పలు పడ్డారు. వర్షం ధాటికి బురద నేలలో నడిచేందుకు వీలు లేక ముళ్లపొదల్లో అవస్థలు పడ్డారు. మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకెళ్లేందుకు కూడా వీలులేక చేతులతో పట్టుకెళ్లారు. ఇక శ్మశాన వాటిక ఇప్పటికే ఆక్రమణకు గురికావడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కూర్చునేందుకు అరుగులు, నీటి సౌకర్యం, కనీసం శ్మశాన వాటికకు సరైన దారి కూడా లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరి మజిలీలో మృతదేహాలకు దక్కుతున్న గౌర వం ఇదేనా అని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

రైల్వే ఉద్యోగాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 2021 సంవత్సరం పూర్వ విద్యార్థులు రైల్వేలో జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినంద నందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వవిద్యార్థులు మస్తాన్‌వలి, తులసి, మహమ్మద్‌గౌస్, చౌడయ్యలు జేఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక కళాశాల ప్రతిష్ఠను పెంచిందన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ ప్రతిభావంతులకు బంగారుపతకం



ఒప్పంద పత్రాలను అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎంఎస్సీ జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం ప్రతిభావంతుల కోసం బంగారు పతకం ఏర్పాటు చేసింది. ఇందుకోసం విభాగ అధ్యాపకులు రూ.1.25 లక్షలు విశ్వవిద్యాలయానికి అందించారు. వడ్డీతో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి స్నాతకోత్సవంలో బంగారు పతకం ప్రదానం చేయనున్నారు. ఈమేరకు అధ్యాపకులు డాక్టర్ ఎ.మునికుమారి, డాక్టర్ ఎల్.దాక్షాయణి, డాక్టర్ బి.రమేష్, డాక్టర్ పి.ఉస్మాన్ బాష, వీసీ ఆచార్య రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, పరీక్ష నియంత్రణ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. అధ్యాపకుల ఉదారతను వైస్ చాన్సలర్ అభినందించారు.

పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రంలోని పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి ఐసీడీఎస్ పీడీ రమాదేవి సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లలకు సంబంధించిన చట్టాలు, శిశు సంరక్షణ సంస్థల్లో కనీస సంరక్షణ ప్రమాణాలు, రక్షణ నిర్వహించడంపై చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ నిర్వాహకులకు, సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో తల్లిదండ్రులు కోల్పోయి కుటుంబ బాంధవ్యాలకు దూరమైన పిల్లలు ఎక్కువగా ఉంటారన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది పిల్లల పట్ల ప్రేమగా ఆప్యాయతతో వ్యవహరిస్తే.. వారు మానసికంగా దగ్గరై వారి సమస్యలను మనతో పంచుకుంటారన్నారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ కడప ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలకు వచ్చే పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారికనుగుణంగా ప్రేమతో వ్యవహరిస్తే మార్పు తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రకాశ్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీఆర్ సుభాష్‌యాదవ్, జిల్లా బాలల పరిమితుల విభాగం ప్రొటెక్షన్ ఆఫీసరు సునీత, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ శాంత, నోడల్ ఆఫీసరు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీలో న్యాయం చేయాలి



ఏపీ జెన్‌కో ఎండీని కలిసిన ఆర్టీపీపీ భూనిర్వాసితులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారు సీనియార్టీ విషయంలో న్యాయం చేయాలని ఎండీ నాగలక్ష్మిని కోరారు. గురువారం సాయంత్రం విజయవాడలోని విద్యుత్ సౌధలో కలమల్ల, సున్నపురాళ్లపల్లె, ఇండ్లసిద్దాయపల్లె, ఇతర చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎండీతో పాటు హెచ్‌ఆర్ డైరక్టర్ ఉష, ఇతర అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో ఆర్టీపీపీ నిర్మాణానికి భూములిచ్చామన్నారు. 2011, 2013లో జీవో నెంబరు 98 ప్రకారం 50శాతం పోస్టులను ల్యాండ్ లూజర్లకు కేటాయించారన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరిగాయన్నారు. గత 12 సంవత్సరాలుగా భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతతో, అనంతరం రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన వారికి మెరిట్ ఆధారంగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటి జాబితాను మార్పులకు గురిచేసి భూ నిర్వాసిత ఉద్యోగులను వెనక్కినెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ పేరుతో 12 సంవత్సరాల తర్వాత సీనియారిటిని తారుమారు చేయడం అన్యాయమన్నారు. భూములిచ్చిన వాళ్లమని, స్థానిక హక్కు సీనియారిటీ తమకే ఉందన్నారు. సీనియారిటీ పేరుతో తమ జీవితాలతో చెలగాటమాడవద్దన్నారు. తమకు అన్యాయం జరిగితే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

జమ్మలమడుగులో డీడీవో కార్యాలయం ప్రారంభం



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పక్కన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ద్వారా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏర్పాట్లు చేయబోతున్న కార్యాలయాల ప్రారంభోత్సవ వర్చువల్ కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంతో పాటు ప్రొద్దుటూరు, రాజుపాళెం, దువ్వూరు, చాపాడు, పది మం డలాలకు కలిపి జమ్మలమడుగులో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రారంభం కావడం సంతోషకరమని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌ఛైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గౌస్ అహమ్మద్, ఎస్.షబ్బీర్, కె.రఫి, అందె జగన్‌మోహన్‌రెడ్డి, కిరణ్‌రాయల్, కర్నాటి రామాంజనేయరెడ్డి, డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో సైదున్నీసా, రామచంద్రారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ జంబోరీలో కడప స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిభ



స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో నవంబరు 23 నుంచి 29 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం యోగి ఆదిత్యానాథ్ ఆధ్వర్యంలో జరిగిన 19వ జాతీయ జంబోరీలో కడప జిల్లా నుంచి ఖాదర్ బాష, చంద్రావతి నేతృత్వంలో 50మంది పాల్గొన్నారు. స్టేట్ ఎక్సో, అడ్వెంచర్, స్టేట్ డే, క్యాంప్ క్రాఫ్ట్ వంటి విభాగాల్లో వారు ప్రతిభ కనబర్చారు. దేశ స్థాయి పేజెంట్ షోలో అన్నమాచార్య కళాశాల రెంజర్లు కోమందురు పవిత్ర, సుమన సుజ ప్రదర్శనలు ఆకట్టుకొని ఉత్తమ పురస్కారం అందుకున్నారు. వీరిని డీఈఓ, చీఫ్ కమీషర్ డాక్టర్ షంషుద్దీన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, అహమ్మద్ సగినాల, జగదీష్, అమర్నాథ్‌బాబు, రాజేష్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రావతి, పావని తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఉద్యోగ అవకాశాలు



అవగాహన కల్పిస్తున్న ఐబీఎం ప్రతినిధి జ్ఞాన్‌యల్లా

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులు శిక్షణ పొందితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఐబీఎం కంపెనీ ప్రతినిధి జ్ఞాన్‌యల్లా తెలిపారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ సమావేశంలో జ్ఞాన్‌యల్లా మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. ఆయా కోర్సుల గురించి విద్యార్థులకు, ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న అధ్యాపకులకు వివరంగా తెలియజేశారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ట్రిపుల్‌ఐటీ అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



నేత్రదానం చేస్తున్న చలపతి కుటుంబ సభ్యులు

కొండాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వ్యక్తి కళ్లు దానం చేయడంతో ఇద్దరికి చూపు దక్కనుందని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కొండాపురం పట్టణానికి చెందిన వెంకటాచలపతి (80) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఆయన కుమారులు బాలాజీ, సంజీవ్‌లు తన తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అనంతపురానికి చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యం లో కొండాపురంకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి హాజీవలి, డాక్టర్ కుళ్లాయిప్ప, టెక్నీషియన్లు రాఘవేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి చలపతి నివాసం చేరుకుని ఆయన నేత్రాలను సేకరించారు. ఈ కళ్లను రెడ్‌క్రాస్ సొసైటీకి తరలించారు.

జాతీయ స్థాయి పోటీలకు సింహాద్రిపురం విద్యార్థి ఎంపిక



ప్రతిభ కనపరచిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్

సింహాద్రిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన హబీబూర్ రహిమాన్ అనే విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు శ్రీ వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ ఖాదర్‌వలీ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జితేంద్ర, హుస్సేన్ బాషా, అతికుల్ రెహమాన్ కూడా రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాస్యం పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన హబీబూర్ రెహమాన్ ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జాఫర్ వలీ, పీడీ త్రిలోక్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

15న శ్రీవారి కల్యాణం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాన్ని ఈనెల 14, 15 తేదీల్లో వైభ వంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కడప మున్సిపల్ మైదా నంలో 14న ఉదయం సుప్రభాతంతో కార్యక్రమం మొదలవుతుంది. కొలువు అనంతరం గోపూజ, మూలవర్లకు అభిషే కాలు, నిశ్చితార్థం నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం సువాసినీలతో సామూహిక కుంకుమార్చన ఎదురోకో లోత్సవం నిర్వహిస్తారు. 15న ఉదయం 9గంటలకు పచ్చని తోరణాలు, మంగళవా యిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చార ణలు.. అన్నమయ్య సంకీర్తనల మధ్య వైభవంగా శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు నిర్వహించే గ్రామోత్సవంలో గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి నగర ప్రజలకు దర్శనమివ్వనున్నారు. మున్సిపల్ మైదానం నుంచి ప్రారంభమయ్యే ఈ నగరోత్సవం కోలాటా లు, చెక్కభజన, బ్యాండ్ మేళాలు, పంచ వాయిద్యాలు, బాణసంచా వెలుగుల మధ్య అప్సర సర్కిల్, ఎన్జీవో కాలనీ, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు, కోఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్ వరకు సాగనుంది. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గోవిందమాల భక్త బృంద సేవాసమితి చైర్మన్ మాదు పుల్లారెడ్డి కోరారు.

స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తత అవసరం

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వ్యాప్తి చెందుతున్న స్క్రబ్ టైఫస్ ఫీవర్‌ను అరికట్టేందుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రజా దృక్పథం, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య శాఖ ప్రాధాన్యతలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్‌లు హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలను అధికారులు బాధ్యతగా పూర్తి చేయాలన్నారు.

నేడు ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సురభి సెమినార్ హాల్‌లో స్వయం, స్వయం ప్లస్, మూక్స్‌పై 5వ తేదీ శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు వైవీయూ స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్పీ వెంకట రమణ తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురుగన్ కీలకోపాన్యాసం చేస్తారన్నారు. పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌పై విచారణకు ఉత్తర్వులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వున్న కొండయ్యపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాపట్ల మున్సిపాలిటీలో పనిచేసినప్పుడు కరోనా సమయంలో బ్లీచింగ్ పౌడరు కొనగోలులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు యూడీఏంఏ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ చార్జ్ మెమో జారీ చేశారు. వారం పది రోజులలోపు ఈ ఆరోపణలపై అసిస్టెంట్ కమిషనర్ సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

పోలీసు స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఎదుట గురువారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా.. కడప మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న మహ్మద్‌రఫి, అమ్మాజీల కుమారుడు పెద్దకుళ్లాయప్ప (18) పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అతని తల్లి చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లి తన కుమారుడిని విడిపించకపోతే ఆత్మహత్యకు పాల్పడతానంటూ విష ద్రావణం తాగింది. వెంటనే ఆమెను పోలీసులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈక్రమంలోనే అమ్మాజీపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ భర్త మాట్లాడుతూ తమ కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టి ఇరికించారని ఆరోపించారు. దీంతో తన భార్య తీవ్ర మానసిక వేదనకు గురై ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలిపారు.

ముంబై పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధి నకాశ్ ప్రాంతంలో నివశిస్తూ రెండేళ్ల కిందట ఆసిఫ్ అనే వ్యక్తి ముంబైకి జీవనాధారం కోసం వెళ్లాడు. అక్కడ ఏడాదిన్నర క్రితం ఓ హత్యకు పాల్పడ్డాడు. తరువాత చాలా కాలం పోలీసులకు దొరకకుండా కడపకు వచ్చాడు. పోలీసులు అతన్ని ఫోను ద్వారా ఆధునిక టెక్నాలజీ ద్వారా కనుగొని కడపకు వచ్చారు. టూటౌన్ ప్రాంతంలో ఉన్న ఆసిఫ్‌ను తమ వెంట తీసుకుని వెళ్లారు.

కొనసాగుతున్న ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. గురువారం ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55.2 ఓవర్లలో 111 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 21 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 88 పరుగుల స్వల్ప స్కోర్ చేసింది. బౌలింగ్ విభాగంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ బౌలర్ వికాష్ 4 వికెట్లు పడగొట్టారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు వెలుతురు సరిగా లేకపోవడంతో మ్యాచ్ మధ్యలోనే నిలుపుదల చేశారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 55 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. ఇందులో రిషి 66 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు వెలుతురు సరిగా లేని కార ణంగా ఆట మధ్యలోనే నిలిపేశారు.



వైభవంగా అంబలం పూజ



పూజ నిర్వహిస్తున్న చంద్ర ఓబుళరెడ్డి (నాని)

సీకేదిన్నె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో అయ్యప్పస్వామి వారి అంబలం పూజ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుళరెడ్డి (నాని) ఆధ్వర్యంలో అంబలంపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పమాల ధరించిన స్వాములు పూజలో పాల్గొని అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్పమాల ధరించినవారు, అయ్యప్పభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అంబలం పూజను విజయవంతం చేశారు. అనంతరం భిక్ష స్వీకరించారు.

స్మార్ట్ కిచెన్ పరిశీలన

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి గురువారం ఉదయం మున్సిపల్ స్కూల్ మెయిన్‌లోని స్మార్ట్ కిచెన్‌ను సందర్శించారు. వంటగది పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచిపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారు పేర్కొన్న సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. భోజన నాణ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

పులివెందుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని అంకాళమ్మపేట, భారతివీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆహారం నాణ్యతగా ఉండాలని, నిర్లక్ష్యం వహించకూడదని అంగన్వాడీ వర్కర్‌కు ఎమ్మెల్సీ సూచించారు.





స్టడీమెటీరియల్ పంపిణీ

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు యూటీఎఫ్ ముద్రించిన పదో తరగతి స్టడీమెటీరి యల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రమణ, సలావుల్లా పంపిణీ చేశారు.

డీడీఓ కార్యాలయం ప్రారంభం

పులివెందుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పాలనను పటిష్టపరిచేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని కూటమి నేతలు అన్నారు. గురువారం పట్టణంలోని మినీ సెక్రటేరియట్‌లో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) కార్యాలయాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీఓ విజయలక్ష్మి, ఆర్డీఓ చిన్నయ్య, ఏడు మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లక్షుమయ్య, పులివెందుల మండల బీజేపీ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ అధికారిగా సరస్వతి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొమ్మద్ది సరస్వతికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా ఉన్న అంజలను హెడ్‌ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

అవని కరదీపిక ఆవిష్కరణ

కడప కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబం- ఒక వ్యాపార వేత్త అన్న నినాదంతో స్వయం సహాయ సంఘాల మహిళల ను లక్షాధికారులను చేయాలన్న సంకల్పంతో మెప్మా రూపొందించిన అవని అనే కరదీపికను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం తన చాంబరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవం



వీరపునాయునిపల్లె, లింగాలలో కోలాటం వేస్తున్న భక్తులు

వీరపునాయునిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆలయంలో గురువారం 30వ ఆరాధనోత్సవాల్లో భాగంగా కాశిరెడ్డినాయన ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులకు అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచిరాత్రి వరకు అన్నదానం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వీఆర్ఎస్ డిగ్రీకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు భక్తులకు సేవలందించారు. కాశిరెడ్డినాయన పాటలు, కోలాటం భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు లక్ష్మీరెడ్డి, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వీవీ సుబ్బానాయుడు, ప్రసాద్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.పాలగిరి శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జంగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల..: లింగాల వనంబావి అపర్ణా సిద్ధలింగేశ్వరస్వామి ఆలయంలో కాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి ఆరాధన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులందరికీ పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సీకేదిన్నె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని రిమ్స్ సర్వజన వైద్యశాల బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర తెలిపారు. రాయచోటి రోడ్డులోని స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 106 మంది విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఫణీంద్రరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ గుద్దేటి ఫణీంద్రరెడ్డి గ్లోబల్ ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్-2026లో ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో స్థానం సంపాదించారు. సౌరశక్తి పరిశోధనలకు ఈ గుర్తింపు లభించింది. జమ్మలమడుగు, కన్నెలూరు గ్రామానికి చెందిన ఆయన 30కిపైగా అంతర్జాతీయ వ్యాసాలు ప్రచురించారు. ఏపీ యంగ్ సైంటిస్ట్-2020 అవార్డు గ్రహీతగాను, ప్రస్తుతం అకాడమీ అసోసియేట్ ఫెలోగా కొనసాగుతున్నారు. వైస్ చాన్సలర్ జయరామిరెడ్డి, సహా అధ్యాపకులు ఆయనను అభినందించారు.

పీపీపీతో పేదలకు వైద్యవిద్య దూరం : డీహెచ్‌పీఎస్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలోకి తీసుకురావడం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య మరింత దూరమవుతుందని డీహెచ్‌పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కడప నగరం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వై.ఇమ్మానియేల్, ప్రధాన కార్యదర్శి కె.మునెయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీఓ 590ని వెంటనే రద్దుచేసి, నూతన మెడికల్ కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని వారుడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

సిమెంటు కుప్పల తొలగింపు




వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం గాంధీరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న సిమెంటు రోడ్డు కుప్పలను తొలగించారు. పంచాయతీ పైప్ లైన్ ద్వారా తవ్విన సిమెంటు కుప్ప, ఇటు మెగా కంపెనీ పైప్ లైన్ ఏర్పాటుకు పెట్టిన గాడి నుంచి వచ్చిన సిమెంటుకుప్పపై రోడ్డుపైఉండి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఈఓ నాగభూషణంరెడ్డి మెగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి తొలగింపజేశారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. అధికారులు రావడం, వారివారి శాఖల గురించి చెప్పడం వెళ్లిపోవడంలా మారిపోయింది. మండల సమావేశంలో సమస్యలు చెప్పుకొంటే పరిష్కారం అవుతాయన్నపరిస్థితి పెద్దగా లేకుండా పోయింది. అధికారులు కూడా పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. కాగా వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన, ఎంపీడీఓ కుళాయమ్మ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు,సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.







ఫసల్ బీమా పోస్టర్ విడుదల

వేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేముల ఏవో కార్యాలయంలో ప్రధానమంత్రి ఫసల్ బీమాపథకం రబీ 2025-26 పోస్టర్‌ను ఏవో ఓబులేసు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వరికి 31 వరకు, మిగతా పంటలకు 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

శనగ పంటకు ఊరట

● మినుము పంటకు దెబ్బ

రాజుపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫానుతో గురువారం మండలంలో సాగైన శనగ పంటకు ఊరట లభించగా మినుము, వరి పంటలకు నష్టం చేకూర్చింది. మండలంలో దాదాపు 15 వేల ఎకరాలకు పైబడి గత 20 రోజుల క్రితం శనగ పంట సాగైంది. అయితే అధిక వర్షాలతో బిర్రెక్కిన భూమి మొక్కదశలోనే వర్షం కోసం ఎదుర చూసే పరిస్థితుల్లో ఈ వర్షం బాగా పడడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంత కంటే ఎక్కువ వర్షం ఉంటే శనగ పంట కూడా నష్టపోయే పరిస్థితి ఉందని, అయితే తగు మోతాదులో వర్షం పడడంతో కొంత ఊరట నిచ్చింది. మినుము పంట పూత దశలో ఉండడంతో పాటు భారీ వర్షానికి పంట అంతా నేలవాలాయి. దీంతో అడుగు భాగాన ఉన్న కాయలు తేమ శాతానికి కుళ్లిపోతాయని రైతులు తెలిపారు. వరి కూడా కోత దశల్లో ఉండడంతో వర్షం నీటితో వరి కర్రలు బరువెక్కి నేలవాలుతాయని తెలిపారు. అధిక వర్షం పడితే నష్టపోవడంతో పాటు కోత మిషను ఖర్చులు కూడా ఎక్కువ వస్తాయని రైతులు తెలిపారు. ఏదేమైనా ఒక పంటకు మేలు చేకూరిస్తే మరో పంటకు నష్టం చేకూర్చే విధంగా ఈ వర్షం కురిసింది. ఇప్పటి వరకు కొన్ని పంటలకు ఇబ్బంది లేకపోయినా ఇంకా ఎక్కువ వర్షం పడితే శనగ పంట కూడా నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు.



శనగపంటలో నిలిచిన వర్షపు నీరు

పోలీసుస్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

చాపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చాపాడు పోలీసుస్టేషన్‌ను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ గురువారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్‌ఐ చిన్నపెద్దయ్యను ఆదేశించారు. ప్రజలు విన్నవించిన సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కారం చేయాలన్నారు. కేసులపై మహిళలకు అవగాహన కలిగించాలని సూచించారు.

రూ.30 లక్షల సొమ్ము వాపస్‌కు లేఖ

● కదిలిన మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ లీజు ఖరారైనా కౌన్సిల్ అనుమతి ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ వేలంపాటలో కట్టిన రూ.30 లక్షలు డిపాజిట్ వెనక్కి ఇవ్వడానికి అనుమతులు కోరుతూ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మున్సిపల్ డైరెక్టర్ సంపత్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన తాత్కాలిక కూరగాయల మార్కెట్ లీజుకు మార్చి 24న మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహించారు. లీజు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు మున్సిపల్ వైసీపీ పాలకమండలి కౌన్సిల్ అనుమతి ఇవ్వకుండా బ్రేక్ వేసింది. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అభివృద్ధికి బ్రేక్' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కౌన్సిల్ అనుమతులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ కాషన్ డిపాజిట్ రూ.30 లక్షలు చెల్లించేలా అనుమతులు ఇవ్వాలని కోరుతూ బుధవారం మున్సిపల్ డైరెక్టర్‌కు మున్సిపల్ కమిషనర్ లేఖ రాశారు. మున్సిపల్ డైరెక్టర్ నుంచి అనుమతులు రాగానే డిపాజిట్ చెల్లిస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రజాదర్బారులో సమస్యల వెల్లువ



ప్రజాదర్బారులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బారుకు గురువారం సమస్యలు వెల్లువలా వచ్చాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై వినతులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో పేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి ప్రజల వద్ద నుంచి రూ.35 వేల వంతున వసూళ్లు చేసి తమ పేరుతో వచ్చిన హౌసింగ్ రుణం కూడా మెక్కేసి తమకు ఇల్లు నిర్మించలేదని బాధితులు ఎమ్మెల్యే వద్ద ఆరోపించారు. దీనిపై హౌసింగ్ అధికారులను పిలిపించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులను ఆదేశించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన వితరణతో పాటు పండ్లను పంపిణీ చేశారు. గురువారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శెట్టిపల్లెకు చెందిన మందాడి బసిరెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఈ సొసైటీ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐఆర్‌డీ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు సుబ్బరాయుడు, రఘురాంలను అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు చిన్నమ్మ, గంగాభవానీ, రమణమ్మ పాల్గొన్నారు.

సీఆర్‌పీలను విలీనం చేయాలి

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీలను రెగ్యులరైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణిలకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్‌పీలకు ట్రావెలింగ్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని, వారు పనిచేసే క్లస్టర్‌లోని ఏ పాఠశాలలోనైనా హాజరు వేసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. సీఆర్‌పీల రిటైర్డుమెంట్‌ను 62 సంవత్సరాలకు పెంచాలని, తదితర డిమాండ్లు చేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు భాస్కర్, గాయత్రి, నాగేంద్ర, సరస్వతి, వరప్రసాద్, కదిరున్నీసా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మైదుకూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఈ మేరకు క్షతగాత్రులను గురువారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ కడప రిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాద బాధితులకు అందిస్తున్న చికిత్సను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారికి అన్నివిధాల అండగా ఉంటామని, మెరుగైన వైద్యం అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఆర్.శ్రీనివాసులు, సర్వాయపల్లి సుబ్బారెడ్డి ఉన్నారు.

పాలకవర్గాన్ని నియమించాలి

బద్వేలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలలో వెనుకబడిన కులమైన ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని గౌరిశంకర్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే ముదిరాజ్‌ల సంక్షేమం కోసం తక్షణమే కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించాలని కోరారు.

నూతన కమిటీ ఏర్పాటు

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో ఏకగ్రీవంగా కొత్త కమిటీ ఏర్పాటు జరిగినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా అత్యవసర సమావేశంలో జమ్మలమడుగులోని మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల నివారణకు, పట్టణంలోని ప్రధాన రోడ్లలో గేదెలు, ఆవులు సంచరించడంపై చర్యలకు సంబంధిత యజమానులు తగు జాగ్రత్తల కోసం సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగులోని ప్రైవేటు, విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

బకాయిలను విడుదల చేయాలి

ప్రొద్దుటూరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన వెయ్యి కోట్లకు పైగా పేరుకుపోయిన రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఐజీ కార్యాలయ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం తాడేపల్లిలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయ కమిషనర్‌ను ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కడపజిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డిలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ కమిషనర్ అంబేడ్కర్ స్పందిస్తూ నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి లేఖ పంపామని, త్వరలో మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు శివచంద్రారెడ్డి పేర్కొన్నారు.

'క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి'



గోడను తొలగిస్తున్న దృశ్యం

బద్వేలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు జనవరి 23 వరకు అవకాశం వుందని, దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, టీపీబీవో నరసయ్యలు తెలిపారు. మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామ పొలంలోని సర్వే నెం.887ను విజిట్ చేసిన వారు ఈ లేఅవుట్‌కు సంబంధించి ఎలాంటి ప్లాట్‌లు రెగ్యులర్ కోసం నమోదు చేసుకోకపోవడంతో హద్దుకు ఏర్పాటు చేసిన రాళ్లను, గోడను తొలగించినట్లు తెలిపారు. అలాగే వ్యక్తిగత ప్లాట్ల యజమానులు ఎల్‌ఎస్‌ఆర్ 2020ద్వారా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని లేకపోతే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

అధికారులతో సమీక్షా సమావేశం

బద్వేలుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకంలో గురువారం రితేష్‌రెడ్డి సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ పథకానికి ఎంతమంది అర్హులున్నారు.. ఇంతవరకు ఎంతమంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలు చేపట్టారనే విషయాలను ఆరాతీశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, హౌసింగ్ పీడీ రాజారాం, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ఎల్‌ఎస్‌బీ డ్యాం చైర్మన్ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డికి అర్జీల వెల్లువ



భూపేశ్‌రెడ్డికి అర్జీలు అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై అర్జీలు అందజేశారు. వీరిలో విశ్రాంత ఉపాధ్యాయుడు మద్దులేటి భూపేశ్, దొడియం, తలమంచిపట్నం, మైలవరం ప్రాంతాలకు చెందిన రైతులు తదితర సమస్యలను తెలిపారు. అలాగే పెద్దముడియం జంగాలపల్లికి ఆర్టీసీ బస్సులో కండక్టరు సర్వీసు ఉండేలా చర్యలు తీసుకోవాలని, తదితర అర్జీలు ఇచ్చారు.

వేడుకగా కల్యాణం

ఎర్రగుంట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని ఫౌంటేన్ వద్ద వెలసిన అశ్వర్థనారాయణస్వామి కళ్యాణోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి, గురుదత్తాత్రేయ జయంతి పండుగ సందర్భంగా అశ్వర్థవృక్షానికి, వేపచెట్టుకు కళ్యాణం నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికే డివిజనల్ కార్యాలయం : విజయమ్మ



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బద్వేలురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మండల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలను డివిజనల్ స్థాయిలో పరిష్కారం చేసేందుకే డీపీవో కార్యాలయం ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ అన్నారు. గురువారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 77కి పైగా డివిజనల్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయమ్మ డీపీవో కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో ఇదోక ప్రతిష్ఠాత్మక అడుగు అన్నారు. కార్యక్రమంలో డీడీవో శేషయ్య, ఏపీడీ మైథిలి, ఎంపీడీవో మల్లీశ్వరి, డివిజన్‌లోని మండల అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

బద్వేలు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది బదిలీల్లో స్థానచలనం పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయులందరినీ ప్రభుత్వం వెంటనే రిలీవ్ చేయాలని ఎస్‌టీపీ నాయకులు రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలో తాత్కాలిక పద్ధతిలో ప్రభుత్వం నియమించబోయే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను అవసరం ఉన్న ప్రతి పాఠశాలలో నియమించాలని ఆయన కోరారు. అలాగే హైస్కూలు స్థాయిలో ఉన్న ఖాళీలను కూడా వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కలసపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గీత, థామస్‌రెడ్డిల సహకారంతో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు, మైండ్‌గేమ్, నైతిక విలువలు నేర్పే పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ప్రభావతిలు మాట్లాడారు. కార్యక్రమంలో స్పాన్సర్‌షిప్ పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు



ఉత్సవాల్లో భారీగా పాల్గొన్న భక్తులు

ఖాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు వద్దనున్న కాశిరెడ్డినాయన ఆలయంలో గురువారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అన్నపూర్ణాదేవి, నవగ్రహ దేవతలకు ప్రత్యేక పూజలు, కాశినాయనకు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ హాజరై పూజలు చేశారు. సాయంత్రం కోలాటం, బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వృషభ రాజములకు నగదు బహుమతి అందించారు. కాగా వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గడువులోగా పనులు పూర్తి చేయండి: ఆర్డీవో



పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కాశినాయన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్మార్ట్ కిచెన్ సెంటర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. గురువారం నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు చివరి నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించేలా చూడాలన్నారు. పనులు నాణ్యమైన రీతిలో త్వరితగతిన సాగాలంటూ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, పీఆర్ ఏఈ బాలపుల్లయ్య, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

చౌకధర దుకాణాల తనిఖీ

దువ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం చౌకధర దుకాణాలను తహసీల్దారు సంజీవరెడ్డి, ఆర్ఐ జాన్సన్ తనిఖీలు నిర్వహించారు. దువ్వూరు, చింతకుంట పరిధిలో పంపిణీ కేంద్రాల వద్దకు వెళ్లి పంపిణీ తీరును పరిశీలించారు. తూకాలను తనిఖీ చేసి సంబంధిత డీలర్లతో మాట్లాడారు. ప్రజా పంపిణీ సవ్యంగా జరపాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆందోళనను జయప్రదం చేయండి

కొండాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. లక్ష్మీదేవమ్మ, వరలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.